# ఇంటికి రాని ఇల్లాలు

"కవితా, ఇవాళ నీకో కేసు వచ్చిందమ్మా..." అంటూ ఆరంభించారు మా డిటెక్టివ్ ఏజన్సీ బాస్ పురుషోత్తం గారు., నేను సోమవారం పొద్దున్న ఆఫీసుకి వెళ్లగానే.

"భార్య మిస్సింగ్ అని భర్త కంప్లెయింట్. ఆవిడ పేరు భాగ్యలక్ష్మి. కుబేరా ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తోంది. మొన్న శనివారం రాత్రి నుండి ఇంటికి రాలేదుట. రెండురోజులు వెయిట్ చేసి ఇవాళ పొద్దున్నే ఆవిడ భర్త నా దగ్గరకు వచ్చాడు..."

"అతన్నోసారి చూస్తే అలాటి డౌట్లేవీ రావు. అతని పేరు తెలుసా సంతానకృష్ణ. నవ్వకు, మద్రాసులో చాలాకాలం ఉన్నారుట వాళ్ల పేరెంట్స్. పేరుకు తగ్గట్టే ఐదుగురు ఆడపిల్లలు కూడా – పదేళ్ల వయస్సు నుండి ఏడాది వయస్సు దాకా అన్ని ఏజ్ గ్రూపుల్లో ఉన్నారు. పెళ్లాన్ని చంపుకుని వీళ్లందరినీ సాకాలని ఏ మగాడూ అనుకోడు. అందువల్ల ఆ ఏంగిల్ వదిలేసి తక్కినవి చూడు. వాళ్ల ఇంటికీ, ఆమె పనిచేసే ఆఫీసుకీ వెళ్లు. అక్కడా అడిగి చూడు. ఆఫీసులో ముఖ్యమైన సీటులో ఉంటే ఎవరైనా కిడ్నాప్ చేసారేమో చూడు. తనంతట తాను వెళ్లిపోయిందనుకోను. ఇంత చిన్నపిల్లలను వదిలేసి ఎక్కడకు పోతుంది?"

నేనైతే వదిలేసి పారిపోదును అనిపించింది వాళ్లింటికెళ్లి ఆ పిల్లలను, వాళ్ల అల్లరిని చూడగానే. అబ్బ, రాక్షసులు నయం. వాళ్లందరిని సముదాయిస్తూ కుచేలుడిలా ఈ సంతానం గారు. మహానుభావుడికి మగపిల్లవాడు కావాలిట. వాడు పుట్టేదాకా కంటూనే ఉండాలని ఈయనా, ఇకచాలని భాగ్యలక్ష్మి ఆరేళ్లుగా కీచులాడుకుంటూనే ఉన్నారుట. అసలు ఆడో, మగో ఇద్దరితోనే ఆపుదామని ఆవిడ మొరపెట్టుకుందిట. కానీ ఈ చాదస్తుడు మగపిల్లవాడు లేకపోతే నరకానికి పోవాల్సి వస్తుందంటాడట. చాదస్తం ఇంట్లో ప్రతీ అంగుళంలోనూ కనబడుతోంది. ఆ భోషాణం వాళ్ల నాయనమ్మ గారి వారసత్వపు ఆస్తిట. ఆ ధాన్యపు గాది అమ్మమ్మది. పెరట్లో ఆ రోలు, రోకలి తిరగలి ఎవరిచ్చినవో మరి! ఈ కాలంలో కూడా ఇలాటి వాళ్లున్నారంటే నమ్మబుద్ధి కాదు.

"పోలీసులకు చెప్పకపోవడమేం? శుక్రవారం రాత్రి పదిగంటలకే కంప్లెయింట్ ఇచ్చాను. కానీ వాళ్లు పట్టించుకోవటం లేదు. టీవీలో చూపిద్దామంటే అనవసరపు పబ్లిసిటీయేమోనని దడిసాను. పోనీ డిటెక్టివ్ ఏజన్సీకి చెప్పకూడదా అని ఓ ఫ్రెండంటే – సరే, మీ కంపెనీ పేరు చెప్పారు – పురుషోత్తం గారు బిజీయా? మిమ్మల్ని పంపించారు" అని అదోలా చూసాడు సంతానం.

"అవునండి. కాస్త బిజీ. వేరే కేసులున్నాయి. ప్రిలిమినరీగా కనుక్కురమ్మని నన్ను పంపారు." అన్నా.

"అన్నీ చెప్పేశానే. నా ఉద్యోగం ఎల్ఐసీలో. వయస్సు నలభై. తనకు ముప్పై ఐదు. ఇదిగో ఫోటో. కుబేరా ఫైనాన్స్‌లో ఎకౌంటెంట్. శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు ఆఫీసు వదిలిందని చెప్పారు. ఇంకా ఇంటికి చేరలేదు. ఈ పిల్లలతో వేగలేక నేను ఛస్తున్నాను. ఒక్కత్తీ మాట వినదు. మీరు అడగవలసినదేదో త్వరగా అడిగిస్తే చంటిదానికి అన్నం పెట్టుకోవాలి" గబగబా అప్పజెప్పేశాడు.

ఆ పిల్లల రణగొణధ్వనిలో ఇంకేం అడక్కుండా బయటపడితే చాలనిపించింది. కానీ రొటీన్‌గా అడగవలసినవి కొన్ని ఉంటాయిగా. "అడక్కూడదనుకోండి, భాగ్యలక్ష్మి గారికి ఎవరితోనైనా ఫ్రెండ్‌షిప్ ఉందా?"

నా ప్రశ్నకు భయపడినంతగా రియాక్ట్ కాలేదతను. "మీరడిగేది అర్థమయింది కవితగారూ! నాక్కూడా

మనస్సులో ఒక ఆలోచన, ఒక ఊహ. భాగ్యం మా అందర్నీ వదిలేసి ఏ లవర్‌తోనో శని, ఆదివారాలు గడిపేసి సోమవారం నాటికల్లా ఇల్లు చేరుతుందని. కానీ దటీజ్ విష్‌ఫుల్ థింకింగ్, ఇన్ ఏ వే. కానీ అలా జరగలేదుగా! నాకు తెలిసి తనకు అలాటి ఎఫైర్స్ ఏమీ లేవు."

ఫోటో కేసి చూశా. చూపులకు మామూలుగా ఉంది. ఎఫైర్స్ పెట్టుకునే రకంలా లేదు. పిల్లల్నే కంటుందా? ప్రేమ వ్యవహారాలే నడుపుతుందా? ఇంకోలా అడిగిచూశా.

"ఈ మధ్య భాగ్యలక్ష్మి గారి ప్రవర్తనలో మార్పేమైనా గమనించారా?"

కాస్త ఆలోచించేడు. "గత ఆర్నెల్లుగా అనుకోండి, కాస్త అన్యమనస్కంగా ఉంటోంది. ఆఫీసులో పనిగొడవలుంటాయి కదా అనుకున్నాను. నా పాలసీ టార్గెట్స్ అవీ నా హడావుడి నాది. ఇద్దరం మాట్లాడుకోవడం తక్కువ. పిల్లలు కనడం విషయంలో మా క్కొంచెం భేదాభిప్రాయాలున్నాయి లెండి" అంటూ పిల్లల గొడవంతా చెప్పుకొచ్చాడు. నేనూ ఆడదాన్నేనేమో నా సింపతీ అంతా భాగ్యలక్ష్మి వైపే. 'కొడుకు కావాలా? తిక్క కుదిరిందిలే! ఈ పిల్లలందరినీ భరిస్తూ కూచో!' అని మనస్సులోనే అనుకుని బయటపడ్డాను.

కుబేరా ఫైనాన్స్ ఆఫీసు స్టాఫ్ తక్కువమందే. సుబ్బమ్మగారని ఓ సీనియర్ దగ్గరకి వెళ్లా. ముతక చీర. మాటా ముతకే! "భాగ్యలక్ష్మి గురించి ముందు మా బ్రాంచ్ మేనేజర్ మనోహర్‌గారిని కలవండి. వారికి బాగా తెలుస్తాయి." అంది అదోలా మాట విరుస్తూ. తర్వాత నా దగ్గరికి వస్తే ఇంకా బోల్డు చెపుతా అనే అర్థం ధ్వనిస్తూ.

మనోహర్‌కి నలభై ఐదుంటాయేమో. మనిషి స్వతహాగా అందగాడే కానీ శ్రద్ధ తీసుకోకపోవడం వల్ల బొజ్జ పెరిగింది. జుట్టు తెల్లబడింది. మంచి పొడుగు. కానీ సీటులో ఒదిగి కూచున్నాడు దిగాలుగా. కళ్ల కింద నల్లటి చారలు.

"భాగ్యలక్ష్మి గారి గురించి ఏం చెప్పమంటారు? కాస్సేపటిలో పోలీసులు వస్తారు. అంతా ఎలాగూ చెప్పాలి." అన్నాడు నుదురు కొట్టుకుంటూ.

మిస్సింగ్ కేసు కాదు, మిస్ఎప్రాప్రియేషన్ కేసు. భాగ్యలక్ష్మి ఆఫీసు డబ్బు స్వాహా చేసేస్తోందిట. ఏడాదికి పైగా సాగుతున్న గోల్‌మాల్ ఎవరికీ తెలియలేదుట. శనివారం నాడు భాగ్యలక్ష్మి రాకపోతే ఆమె సీట్లో కూచున్నవారి వద్దకు ఒక కస్టమర్ వచ్చి తన డిపాజిట్ విత్‌డ్రా చేద్దామనడంతో ఇదంతా బయటపడిందట. బోగస్ డిపాజిట్ రిసీట్‌లు ఇచ్చి, కంపెనీకి రావలసిన డబ్బుని తన బ్యాంక్ ఎక్కవుంట్లో వేసుకుంది. ఆ బ్యాంక్ పాస్‌బుక్ కూడా దొరికింది. ఎక్కవుంట్‌లో ఉన్న పదిలక్షలు శుక్రవారం నాడే డ్రా చేసేసింది.

"ఇప్పుడు ఇదంతా నా నెత్తిన చుట్టుకునేట్టుంది. మేనేజర్‌నయి వుండి ఇదంతా గమనించలేదని హెడ్ ఆఫీసువాళ్లు నా వెంట పడతారు. శనివారం నుంచీ నిద్రలేదు. ఎవడికి తెలుస్తుంది... భాగ్యలక్ష్మి గారు ఇలాటి పని చేస్తుందని!? టిపికల్ హౌస్‌వైఫ్‌లా ఉంటుంది. పని బాగా చేస్తుంది. గుడ్డి నమ్మకంతో సంతకాలు పెట్టేశాను. ఇప్పుడు చూస్తే...?" మనోహర్ గొంతు గద్గదమైంది.

పాపం! అతడిని చూస్తే ఓదార్చబుద్ధేసింది. భాగ్యలక్ష్మి ఫోటో చూస్తే అనుమానం కలగలేదు. అలా కొట్టేసిన డబ్బు పోనీ ఇంట్లో ఇచ్చిందా అంటే అదీ లేదు. అంటే తనకోసమే ఉంచేసుకుందా? తను అలాటి రకమా?

ఇంకోలాటి రకం కూడా అంది సుబ్బమ్మగారు. "నంగనాచి. పత్తిత్తులా పోజు" అంది. "ఎవరతను?" అడిగేను. మేనేజర్ ఛాంబర్ వైపు కళ్లెగరేసింది.

"ఛ, పెద్దమనిషిలా ఉన్నాడు" అన్నాను నమ్మనట్టు.

"పెళ్లాంతో అస్సలు పడదు. ఈ భాగ్యలక్ష్మి మొగుడితో విసిగిపోయింది. మొగపిల్లాడు, మొగపిల్లాడంటూ ప్రాణాలు తోడేస్తున్నాడు. పురుడు మీద పురుడు. ఛస్తుందా?"

"మీరు చూసారా?"

"ఇవన్నీ చూసేట్టు చేస్తారా? అది అంత డబ్బు కొట్టేసిందంటే ఇతనికి తెలియకుండానే జరిగిందా? డబ్బుచ్చుకుని ఇద్దరం ఎక్కడికో ఉడాయిద్దామని ప్లానేసి ఉంటారు. అది డబుల్‌క్రాస్ చేసి తుర్రుమంది. ఇతను ఇరుక్కుపోయాడు." అని తేల్చేసింది సుబ్బమ్మ.

భాగ్యలక్ష్మి కాగితాలు, టేబుల్ డైరీ అన్నీ వెతికాను. కొన్ని ఫోన్ నెంబర్లు దొరికాయి. "లాకర్ కూడా చూడండి. ప్రతీ స్టాఫ్‌కీ ఒక్కోటి ఇచ్చారు, బట్టలూ అవీ పెట్టుకోవడానికి. తాళం డ్రాయర్‌లో దొరకవచ్చు" అంది స్టాఫ్‌లో ఇంకో అమ్మాయి. లాకర్ ఖాళీగా ఉంది. "అన్నీ ముందే ఊడ్చేసిందన్నమాట" అంది సుబ్బమ్మ ఆశ్చర్యంగా.

"మీరన్నట్టు ఏదైనా ఊరెళ్లి ఉంటే, ఇంటికొచ్చి బట్టలూ, అవీ పట్టుకెళ్లాలి కదా! కానీ ఇంటికే వెళ్లలేదు. ఆఫీసు నుండి ఐదు గంటలకు బయలుదేరినప్పుడు చేతిలో బ్యాగూ అదీ లేదంటున్నారు. ఆరు గంటలకు ఆఫీసు తాళం వేసుకుని అందరూ వెళ్లిపోయారు..." అంటూనే ఆలోచనలో పడ్డాను.

"ఒకలా కావచ్చు లెండి. పది లక్షలు పట్టుకుని ఏ బొంబాయో వెళ్లినప్పుడు అన్నీ కొత్తగా అక్కడే కొనవచ్చుగా. మనిషిని గుర్తుపట్టకుండా ఉండడానికి చీరలు అవీ మానేసి, ఏ గోవా అమ్మాయిలాగానో కనబడడానికి గౌన్లు అవీ వేసుకుంటుందేమో! అలాటప్పుడు ఈ చీరలు ఎందుకు? డబ్బుంటే ఏదైనా ఎక్కడైనా కొనవచ్చు. మోతబరువూ తప్పుతుంది. స్టేషన్లో ఎవరి కంటైనా పడినా అనుమానమూ రాదు" అంది లాకర్ విషయం చెప్పిన అమ్మాయి.

ఆ అమ్మాయి అనుకోకుండానే నాకో హింట్ ఇచ్చింది. భాగ్యలక్ష్మి అంత డబ్బుతో పారిపోయి ఉంటే కనక విమానంలో వెళ్లివుంటుంది. శుక్రవారం నాటి ఫ్లైట్‌లలో వెళ్లిన లేడీ పాసింజర్ల వివరాలు చెక్ చేస్తే మంచిదనిపించింది. పోలీసులు వచ్చి వెళ్లాక సాయంత్రం మళ్లీ వస్తానని చెప్పి బయటపడ్డాను.

భాగ్యలక్ష్మి డెస్క్‌డైరీలో దొరికిన నాలుగు ఫోన్ నెంబర్లలో ఒకటి మెటర్నిటీ హోమ్‌ది. ముందు అక్కడికే వెళ్లాను. పి.భాగ్యలక్ష్మి ఫైల్ కావాలని అడిగేను. మీరెవరంది అక్కడి రిసెప్షనిస్టు. 'జనరల్ ఇన్సూరెన్స్ నుండి వచ్చా. ఎబార్షన్ అని హెల్త్ ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసింది భాగ్యలక్ష్మి. కావాలంటే మిమ్మల్ని అడగమంది. ఏదో ఐడెంటిటీ నెంబరు వచ్చింది కానీ ఎక్కడో పారేశా" అన్నాను.

"ఎబార్షనా? బలే కోసిందే! గర్భాశయం తీసేసి ఆరునెలలయిందిగా!" అందామె ఫైల్లోకి చూస్తూ. "అలా ముంగిలా కనబడుతుంది. గడుగ్గాయేనన్నమాట! ఈ పాలసీలు వచ్చేక మిస్‌యూజ్ చేసేవాళ్లు చాలామంది తయారవుతున్నారు లెండి. పైగా ఛాలెంజ్ ఒకటి – కావాలంటే చెక్ చేసుకోమని" అంటూ వ్యాఖ్యానించింది కూడా.

అంటే మొగుడికి చెప్పి ఇక లాభం లేదని అతనికి తెలియకుండా పిల్లలు పుట్టకుండా ఏర్పాటు చేసుకుందన్నమాట భాగ్యలక్ష్మి. ఈ విషయంలో మాత్రం ఆమెకు నా సింపతీ పరిపూర్ణంగా ఉంది. ఆ సంతానం గాడు సంతానం మీద ఇంకా ఆశ పెట్టుకునే కూచుని ఉన్నాడు. 'వచ్చే ఏడాదైనా కొడుకు పుడతాడని అనుకుంటూంటూ ఉంటే ఇలా జరిగింది' అంటూ నా దగ్గర వాపోయేడు కూడా. సంతానం గుర్తుకు రాగానే మనోహర్ కూడా జ్ఞాపకానికి వచ్చాడు. పిల్లలు పుడతారన్న భయం లేకుండా భాగ్యలక్ష్మి, అతను హాయిగా కలిసేవారన్నమాట! ఒకవేళ అతనిదేనేమో ఈ ఐడియా! హూ నోస్!?

విమాన ప్రయాణికుల లిస్టులో భాగ్యలక్ష్మి ఏజ్ గ్రూప్‌లో ఉన్నవాళ్లు ఆరుగురు దొరికారు. అందులో భారతి అనే ఆమె ప్రయాణం చేయలేదు కూడా. ఆమె టికెట్ బుక్ చేసినది ఐడియల్ ట్రావెల్స్ అని కుబేరా ఫైనాన్స్‌కి దగ్గరలోనే ఉంది. వెళ్లి అడిగితే భాగ్యలక్ష్మే వచ్చి టిక్కెట్ బుక్ చేసిందని చెప్పారు వాళ్లు. కుబేరా వాళ్లు వాళ్ల క్లయింట్లు కాబట్టి స్టాఫంతా తెలుసు. భారతి తన ఫ్రెండని చెప్పి భాగ్యలక్ష్మే టిక్కెట్టు తీసుకుందిట. 'ఆరున్నరకు వెళ్లాల్సిన ఫ్లయిట్ అరగంట ఆలస్యం అవుతోందంటే వాళ్లింటికి ఫోన్ చేసి చెప్పాం కూడా' అన్నాడు ఐడియల్ ట్రావెల్స్ వాడు.

అంటే భాగ్యలక్ష్మి ఇల్లు చేరిందన్నమాట, సంతానం అబద్ధాలు చెప్తున్నాడా? ఆలోచిస్తూ కుబేరా ఫైనాన్స్ ఆఫీసుకి చేరాను. అక్కడ అప్పటికే పోలీసులున్నారు. ఇన్‌స్పెక్టర్ తెలిసున్నవాడే. "కేసు ఎలా

వుంది సార్?" అన్నా. "ఓపెన్ అండ్ షట్ కేస్ లాగానే ఉంది. ఈ మేనేజర్ కల్‌ప్రిట్" అనేశాడు చులాగ్గా.

"చూడ్డానికి అలా ఉన్నాడు మరి..." అన్నాను ఆశ్చర్యంగా.

ఇన్‌స్పెక్టర్ విజయగర్వంతో చూసాడు. "మీ ఆడాళ్లకి అందగాడు - ఇతను మాజీ అందగాడే అనుకో- కనబడితే చాలు, ఒళ్లు తెలియదు. వాళ్ల మీదకు అనుమానం పోదు. కానీ నాకు చూస్తూనే అనుమానం తగిలింది. ఆ భాగ్యలక్ష్మి సింపుల్ లుకింగ్ లేడీ. వీడు లైనులో పెట్టేశాడు. వాడి కబుర్లకు, చూపులకు ఆమె పడిపోయింది. వీడు చెప్పినట్టు ఆడింది. డబ్బు గోల్‌మాల్ చేసింది. ఇద్దరు తోడుదొంగలు కలిసి ఉడాయిద్దామని ప్లాను చేసారు. శనివారానికి టిక్కెట్లు బుక్ చేసుకున్నారు మద్రాసుకి..."

"...మీకెలా తెలుసు?"

"అది బిట్ ఆఫ్ లక్కనుకో. మేం ఇంటరాగేట్ చేస్తూండగానే భాను ట్రావెల్ ఏజన్సీ వాళ్ల కుర్రాడు వచ్చాడు - టిక్కెట్లు కలెక్ట్ చేసుకోలేదేం, కాన్సిల్ చేయమంటారా? అని అడగడానికి. టిక్కెట్లు మీద వీళ్లిద్దరి పేర్లూ ఉన్నాయి. శుక్రవారమే బుక్ అయింది. శనివారం సాయంత్రం ఫ్లయిట్‌కి. కానీ టిక్కెట్లు కలెక్ట్ చేసుకోవడానికి వెళ్లలేదు ఈ పెద్దమనిషి. నిన్న సెలవు. ఇవాళ ఆఫీసు తెరిచాక చూసి చూసి వాళ్ల కుర్రాడితో టిక్కెట్లు పంపించివేశాడు ఏజంటు."

"టిక్కెట్లు చేతిలో ఉండి కూడా పారిపోలేదేం వీళ్లు?"

"పారిపోవడానికి పార్ట్‌నర్ ఉంటేగా? శుక్రవారం సాయంత్రమే వాటాలు తెగక ఏదో గొడవ వచ్చి ఉంటుంది వీళ్లద్దరి మధ్యా. కోపంలో - ఏక్సిడెంటల్‌గానో, ఇంటెన్షనల్‌గానో - చంపేసి ఉంటాడు. శవం బయటపడ్డాక సరిగ్గా తెలుస్తుంది. శవం దాచిన దగ్గరే డబ్బూ దాచి ఉంటాడు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ నమ్మకంగా.

"మనిషిని చూస్తే అలా అనిపించదు. మీరన్నట్టు భాగ్యలక్ష్మిని వలలో వేసుకుని ఆఫీసు డబ్బు కొట్టేయడం సాధ్యమే కానీ, బొత్తిగా హత్య... నో..., డిఫికల్ట్ టు బిలీవ్! వాళ్లిద్దరూ కలిసి పారిపోదామనుకున్నారని ఏ ఆధారంతో అంటున్నారు? ఆమెకు కూడా ఐదుగురు పిల్లలు..."

"లాకర్లు ఓపెన్ చేశాంగా! మేనేజర్ లాకర్లో ఓ బ్యాగ్ దొరికింది. లేడీస్ ట్రావెల్ బ్యాగ్ లాటిది. ఇదిగో చూడండి. భాగ్యలక్ష్మి బట్టలేనని స్టాఫ్ కూడా అన్నారు. ఇద్దరూ కలిసి జండా ఎత్తేయడానికి ప్లాను వేసుకున్నారు."

బ్యాగ్ చూడబోతే ఇన్‌స్పెక్టర్ లాజిక్ కరెక్టే అనిపించింది. ఆ బ్యాగ్‌లో ఆడవాళ్ల బట్టలు, లో దుస్తులు, టవల్, టూత్‌బ్రష్, లిప్‌స్టిక్, పౌడరు, స్నో, శానిటరీ నాప్‌కిన్స్, గర్భనిరోధక మాత్రలు - లాటి అన్ని రకాల లేడీస్ సరంజామా, అంటే ఒక స్త్రీ ప్రయాణానికి ఏమేం సర్దుకుంటుందో అన్నీ ఉన్నాయి. అది చూడగానే ఎవరైనా చెప్తారు, భాగ్యలక్ష్మి మేనేజర్ మనోహర్‌తో సెటప్ అయిపోవడానికే అన్ని ఏర్పాట్లు చేసి పెట్టుకుందని.

"చూసావా? నా అనుమానం కరెక్టేనా? నా ఊహ ప్రకారం ఈ బ్యాగ్ ఇలాగే తీసుకొచ్చి ఉండదు. ఓసారి ఖాళీ బ్యాగ్ మడతపెట్టి పట్టుకొచ్చి పడేసి, ఆ తర్వాత రోజు కొక వస్తువు తీసుకొచ్చి పడేసి ఉంటుంది. తన లాకర్ తక్కిన కొలీగ్స్ చూసే డేంజరు ఉంది. అదే మేనేజరుదైతే ఎవ్వరూ దాని జోలికి వెళ్లరు." అన్నాడు ఇన్‌స్పెక్టర్ సర్వాంతర్యామిలా.

తల ఊపక తప్పేదేముంది. అయినా నేనడగదలచుకున్న సహాయం అడిగేశాను.

ఆఫీసు బయటపడ్డాక భాను ట్రావెల్ ఏజన్సీకి ఫోన్ చేసి 'శనివారం టిక్కెట్లు ఎవరు వచ్చి బుక్ చేసారని అడిగేను. ఎవరో మధ్యవయస్కుడట. మనోహరా? అని అడిగేను. "ఏమో, మనోహర్ పేరు వినడమే కానీ ఎలా ఉంటారో తెలియదు" అన్నాడు ఏజన్సీ వాడు. అదే ఊపులో ఐడియల్ వాళ్లకి ఫోన్ చేశా. వాళ్లు శుక్రవారం సాయంత్రం ఎన్ని గంటలకు భాగ్యలక్ష్మికి ఫోన్ చేసారో తెలుసుకుందామని. కానీ అప్పటికే వాళ్ల ఆఫీసు మూసేశారు.

సంతానం ఇంటికి వెళ్లేసరికి ఎప్పటిలాగానే పిల్లలతో కుస్తీ పడుతున్నాడు. ఇల్లంతా ఒకటే గబ్బు కంపు. ఇంతమంది పిల్లలతో ఇల్లు శుభ్రంగా ఉంచడం మహాకష్టం. నన్ను చూడగానే కాస్త ఎక్సైట్ అయ్యేడు. "ఏమైనా ఆచూకీ దొరికిందా?" అని అడిగేడు ఆతృతగా.

"అప్పుడే ఎక్కడ!?" అంటూ వాళ్ల అబ్బాయికేసి తిరిగి, "ఏం బాబూ, భారతి అని మీ అమ్మకు ఓ ఫ్రెండుందా?" అని అడిగేను. "ఉందిగా!" అన్నాడు వాడు అంతే స్పీడుగా.

"సార్, ఆవిడ ఫోన్ నెంబరు ఇవ్వండి" అని అడిగేను సంతానాన్ని.

"చూడండి. అక్కడే ఫోన్ పక్కన బుక్‌లో ఉండవచ్చు. అయినా ఇప్పుడు ఆవిడెందుకు?" అంటూ నసిగేడు సంతానం.

భారతే ఫోన్ తీసుకుంది. "ఏమండి, శుక్రవారం నాడు మీరు టిక్కెట్టు బుక్ చేసారా? అంటూ మీకు ఫోన్ చేసిందెవరండీ?" అని అడిగేను, నన్ను నేను పరిచయం చేసుకున్నాక.

"సంతానంగారే కదా, నేనేమీ బుక్ చేయలేదని చెప్పడంతో అహాఁ, అలాగా అని ఊరుకున్నారు" అంది భారతి.

సంతానం చికాకు పడ్డాడు. "ఆ మాట నన్నడిగితే నేనే చెప్పేవాణ్ని. వాళ్లెవరో ట్రావెల్ కంపెనీవాళ్లు ఫోన్ చేసి భాగ్యం భారతి పేర టిక్కెట్టు బుక్ చేసిందని, ఫ్లయిట్ లేటయిందని చెప్పేరు. భారతి ఫోన్ తెలియక, బుక్ చేసింది భాగ్యం కదాని మాకు ఫోన్ చేసి ఉంటారనుకున్నా. భారతికి ఫోన్ చేసి చెప్పా. తీరా చూస్తే ఆవిడ నేను టిక్కెట్టు బుక్ చేయనేలేదంది. ఈ భారతి కాదేమో, మరెవరైనా ఉందేమో అనుకుని ఊరుకున్నాను, ఇంటికొచ్చాక భాగ్యానికి చెబితే తనే చూసుకుంటుందని. తను ఇంటికి రాలేదు. ఈ గొడవలో పడి ఆ విషయమే మర్చిపోయా. అయినా ఈ పిడకల వేటేమిటి? భాగ్యం సంగతి తెలిసిందా? లేదా?"

"తెలిసిందండి. మీరు కాస్త ఓపిగ్గా వినాలి. అసలేమయిందంటే మీ భాగ్యం మీరనుకున్నంత అమాయకురాలు కాదు. మేనేజరుతో ప్రేమలో పడింది. ఇద్దరూ కలిసి ఆఫీసు డబ్బు కాజేసి మిమ్మల్నందర్నీ వదిలేసి ఉడాయిద్దామనుకున్నారు..."

"...నాన్సెన్స్, వాట్ ద హెల్ యూ ఆర్ టాకింగ్, యూ.." అంటూ కోపం తెచ్చుకున్నాడు సంతానం.

"అందుకే నిదానంగా వినమన్నది. నేను చెప్పినది మేనేజరు ప్లాను మాత్రమే. కానీ మీ భాగ్యం అతని కంటె ఘనురాలు. డబ్బుంటే చాలు ఇలాటి మేనేజర్లు పదిమంది దొరుకుతారనుకుందేమో డబ్బు తీసుకుని ఒకత్తే పారిపోదామని విమానం టిక్కెట్టు కొనుక్కుంది. తన పేరుతో ఎలా కొంటుంది? మారుపేరు కావాలి. మారుపేరు అనగానే ప్రతీవాళ్లకూ తన పేరుకు దగ్గరగా ఉండి తనకు తెలిసున్నవాళ్ల పేర్లే తడతాయని మాలాటి డిటెక్టివ్‌లందరికీ తెలుసు. భాగ్యలక్ష్మికి భారతి గుర్తొచ్చింది. ఆమె పేరుతో టిక్కెట్టు బుక్ చేసింది. అనుకున్న ప్రకారం శుక్రవారం ఆఫీసు వదలగానే ఆ డబ్బుతో సహా ఎయిర్‌పోర్టుకి చేరుకుంది. ఆ డబ్బును ట్రావెలర్స్ చెక్స్‌గానో, డాలర్లగానో, మరోవిధంగానో మార్చుకోవడం కోసం కాస్త లేటు కూడా అయిందేమో! ఫ్లయిట్ టైముకి ఎయిర్‌పోర్టుకి చేరుకుంది. కానీ ఈ లోపున ఫ్లయిట్ లేటయిందన్న విషయం చెప్పడానికి ఐడియల్ ట్రావెల్స్ ఏజన్సీవాడు ఇంటికి ఫోన్ చేయడం, మీరు ఫోన్ తీసుకోవడం జరిగింది."

"ముందు పార్ట్ కల్పనే కానీ, చివరి వాక్యం మాత్రం కరెక్టు." అన్నాడు సంతానం అసహనంగా.

"అడ్డు రాకండి. భారతి చెప్పిన సమాచారం వినగానే మీకు అనుమానం వచ్చి ఉంటుంది. ఎయిర్‌పోర్టు కెళ్లి చూస్తే విమానాల్లో తిరిగే ఆ భాగ్యలక్ష్మి ఫ్రెండెవరో తెలుస్తుంది కదా అనుకుని వెళ్లారు. అక్కడ భాగ్యలక్ష్మి మీకు కనబడింది. తను ఉలిక్కిపడింది మీకు గుట్టు ఎలా తెలిసిందాని. ఏదో గందరగోళంగా మాట్లాడి ఉంటుంది. మీకు అనుమానం వచ్చేసింది. తనను బలవంతంగా ఇంటికి తీసుకొచ్చేరు. ఆమె చేత నిజం కక్కించారు. కోపం పట్టలేక కొడితే ఆమె చచ్చిపోయి ఉండిపోవచ్చు. లేదా మీరే పీక పిసికేసి ఉండవచ్చు.

"భాగ్యలక్ష్మి చచ్చిపోయాక మీకు భయం వేసింది. ఎలా తప్పించుకోవాలా అని ప్లాను వేశారు. ఈ పాపం మేనేజరు మీద తోసేయడానికి నిశ్చయించుకున్నారు. భాగ్యలక్ష్మి ఆఫీసు బ్యాగ్‌లో ఆఫీసు తాళాలు, మేనేజర్ లాకర్ తాళాలు దొరికి ఉంటాయి. డబ్బు గోల్‌మాల్ చేసేవాళ్లు డూప్లికేట్లు తయారు చేసి ఎప్పుడో పెట్టుకుంటారు. భాగ్యలక్ష్మి, మనోహర్ కలిసి పారిపోదామనుకున్నారని అందరూ అనుకొనేట్లా రంగం సిద్ధం చేసారు. ఆమె ట్రావెల్ బ్యాగ్ మీరే తయారు చేసారు. పట్టుకెళ్లి మనోహర్ లాకర్‌లో పెట్టేసారు. ఆ తర్వాత భాను ట్రావెల్ ఏజన్సీకి వెళ్లి భాగ్యలక్ష్మి, మనోహర్‌ల పేర్ల మీద రెండు టిక్కెట్లు బుక్ చేసేశారు. ఖర్మకొద్దీ వాడు సరిగ్గా సోమవారం పోలీసులున్నప్పుడే వచ్చి టిక్కెట్ల విషయం బయటపెట్టాడు. దాంతో అందరి అనుమానం మనోహర్ మీదకే పోయింది. కానీ మీరు చేసిన చిన్న పొరబాటు కారణంగా మీరు పిక్చర్‌లోకి వచ్చేరు" అని గుక్కతిప్పుకోవడానికి ఆగేను.

ఏదో సీరియల్ కథ వింటున్నట్టు నోరు వెళ్లబెట్టి వింటున్న సంతానంలో చలనం వచ్చింది. "నేనా? నేనేం పొరబాటు చేసాను?" అన్నాడు ఆదుర్దాగా.

"భాగ్యలక్ష్మి ట్రావెల్ బ్యాగ్ తయారు చేయడంలోనే మీరు దొరికిపోయారు. దాంట్లో గర్భనిరోధక మాత్రలు వేయడమే మిమ్మల్ని పట్టిచ్చింది."

అతను పజిల్ అయిపోయాడు. "దాంట్లో ఆశ్చర్యమేముంది? ఆమె పిల్లలు కని, కని విసిగిపోయింది. మనోహర్‌తో సుఖం కోరుకుంటుంది కానీ పిల్లల్ని కాదు. అందువల్ల పిల్లలు పుట్టకుండా జాగ్రత్తపడడం సహజం" అన్నాడు తీవ్రంగా.

"అంతవరకూ కరెక్టే. కానీ భాగ్యలక్ష్మి గర్భసంచీ తీయించేసుకుంది. ఆ సంగతి మీకు తెలియకనే వచ్చే ఏడాది మగపిల్లవాడు పుడతాడని ఆశిస్తున్నాం అన్నారు నాతో. గర్భం దరిస్తానన్న భయం లేని భాగ్యలక్ష్మి తనంతట తానే బ్యాగ్ సర్దుకుంటే ఆ మాత్రలు ఎందుకు వేసుకుంటుంది? అందువల్ల వేరెవరో అది తయారు చేసి అక్కడ పెట్టారని అర్థమయింది."

"అది నేనే అవ్వాలని రూలేముంది?"

"ఆమె బట్టలు, లోదుస్తులు, దువ్వెన్న అన్నీ ఇంట్లో నుండే తీసుకున్నారు. దానికి మీకే ఎక్కువ ఆస్కారం ఉంది. భాను ట్రావెల్ ఏజన్సీ వాళ్లు మనోహరే టిక్కెట్టు బుక్ చేసాడని గట్టిగా చెప్పలేకపోయారు. ఐడియల్ వాళ్లు మీ ఇంటికి ఫోన్ చేసేరని చెప్పడంతో ఇదంతా ఊహించేను. మీరిప్పుడు చెప్పండి, ఎంతవరకు నా ఊహ కరక్టో!"

సంతానం నిట్టూర్చాడు. "మీకు డిటెక్టివ్ అప్రెంటిస్‌గా రెండేళ్ల అనుభవమే ఉందంటున్నారు. కానీ మీ బుర్ర మాత్రం అమోఘం. అంతా కళ్లతో చూసినట్టు చెప్పారు. కానీ ఒక విషయం మీరు తెలుసుకోవాలి. ఇదంతా మీ ఊహే! శవం దొరికేదాకా ఏదీ ప్రూవ్ చేయలేరు."

"ఆ పాయింట్ కరక్టే! మీరు శవాన్ని దాచి, మేనేజర్‌ను అరెస్టు చేశాక కొన్ని రోజులకి అది సర్ఫేస్ అయ్యేట్లా చేస్తారు. దాని ఆధారంగా పెద్దగా ఏ క్లూలు దొరకకుండా చేస్తారు..."

"బాగానే లెక్కవేసారు. అందుచేత శవం వెంటనే దొరికితేనే నాకు ప్రమాదం. కానీ దొరకదుగా!" అన్నాడతను నిబ్బరంగా.

"దొరుకుతుంది. ఈ భోషాణం తెరిచిచూస్తే కనబడుతుంది. మీ నాయనమ్మ భోషాణం ఇందుకు పనికివచ్చింది మీకు. మీ పిల్లలు అల్లరితో దాని వాసన కూడా కేమోఫ్లాజ్ అయిపోతోంది."

సంతానం మొహాన కత్తివాటుకి నెత్తురుచుక్క లేదు. నాకేసి చూస్తూ ఉండిపోయాడు కాస్సేపు. తర్వాత ఏడవసాగేడు. "భాగ్యం ఇలాటిదని నేను కలలో కూడా ఊహించలేదు. ఆ మనోహరే తనను చెడగొట్టాడు. కొడుకు కావాలన్న వెర్రిలో పడి నా భార్యను దూరం చేసుకున్నాను. అన్నీ ఒక్కసారే బయటపడ్డాయి. భరించలేకపోయా. ఒక్కదెబ్బకే ప్రాణం పోయింది. తను కూడా మెంటల్‌గా చాలా టెన్షన్‌లో ఉందేమో మరి! హత్య చేసేక పిల్లల కోసమేనా కవరప్ చేయాలిగా! నాకా పాపిష్టి డబ్బు కూడా అక్కర్లేదు. ఈ ఆడపిల్లలనందరినీ ఎలాగో అలా నేనే సాక్కుంటాను. నాకు శిక్ష పడితే వీళ్లంతా

అనాథలవుతారు. మీరు నన్ను వదిలేస్తే, చూసీ చూడనట్టు ఊరుకుంటే సంతోషిస్తాను. మీరింత సమర్థులని తెలియక నా సేఫ్టీ కోసం నేనే మిమ్మల్ని ఎంగేజ్ చేసి నా ప్రాణాల మీదకు తెచ్చుకున్నాను" అంటూ చాలా సేపు దుఃఖించాడు.

నేను ఓదార్పుగా అతని చేయి పట్టుకున్నాను. "సారీ, నేనేం చేయలేను. పోలీసులనడిగి అన్ని రకాల ఏర్పాట్లతో వచ్చేను. నా పమిటకి పెట్టినది క్లిప్ కాదు. మైక్. మీ మాటలన్నీ పోలీస్ స్టేషన్‌లో అందరూ విన్నారు. ఏ క్షణాన్నైనా వాళ్లు వస్తారు." అన్నాను జాలిపడుతూనే.

నా మాటలు పూర్తి కాకుండానే పోలీసులు సంతానం ఇంటిని చుట్టుముట్టారు.